క్లుప్తంగా

మహానందిలో కొనసాగుతున్న రద్దీ



కోనేరులో భక్తుల స్నానాలు

మహానంది: మహానంది ఆలయంలో భక్తజన సందడి కొనసాగుతోంది. మహానందీశ్వరుడికి ప్రీతికరమైన సోమవారం కావడంతో పలు ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న నవనంది క్షేత్రాలైన వినాయక నంది, గరుడనంది ఆలయాలను భక్తులకు సందర్శించి పూజలు చేపట్టారు.

పల్లకీలో ఆదిదంపతుల విహారం



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

మహానంది: ప్రసిద్ధ శైవక్షేత్రమైన మహానందిలో వెలిసిన శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి దంపతులు సోమవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతశర్మ, ఆంజనేయశర్మ, అర్చకులు స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. స్థానిక అలంకార మండపంలో శాస్త్రోక్తంగా పూజలు చేసిన అనంతరం పల్లకీలో కొలువు చేసి ఊరేగించారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..



డాక్టర్ వేద్ ప్రకాష్ మిశ్రాకు వేదాశీర్వాదం

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో బనగానపల్లె నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఎన్నికల పరిశీలకులు డాక్టర్ వేద్ ప్రకాష్ మిశ్రా సోమవారం పూజలు నిర్వహించారు. స్వామి దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఇన్స్పెక్టర్ శశిధర్‌రెడ్డి, పండితులు స్వాగతం పలికారు. ఈ మేరకు ఆయన శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో స్వామి,అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మిడుతూరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ జగన్ మోహన్ సూచించారు. సోమవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ మంగళవారం సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అందరూ తమ ఇంట్లోనే ఉంటూ అసెంబ్లీ , పార్లమెంటు ఫలితాలను వీక్షించాలన్నారు. గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని, గుంపులుగా బహిరంగ ప్రదేశాల్లో సంచరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయిన తర్వాత విజయం సాధించిన పార్టీలకు చెందిన నాయకులు విజయోత్సవ ర్యాలీలు చేయడానికి అనుమతులు లేవన్నారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు పోలీసులకు సహకరించాలనికోరారు. పోలీస్ ఆక్ట్ 30 అమలు ఉందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మోడల్ స్కూల్‌లో మిగిలిన సీట్ల భర్తీకి నోటిఫికేషన్

వెలుగోడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రిన్సిపాల్ నళిని సోమవారం తెలిపారు. బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందిస్తున్న మోడల్ స్కూళ్లలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 7, 8, 9వ తరగతిలో మిగిలిన సీట్ల ప్రవేశాలకు ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటలలోపు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 10వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నామని చెప్పారు. పూర్తి వివరాలకు ఏపీ మోడల్ స్కూల్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

దోమల నివారణతో ఆరోగ్యం

నంద్యాల టౌన్: దోమలు, దోమ కాటుని నివారించి, పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు ఆధ్వర్యంలో మలేరియా మాసోత్సవాలకు సంబంధించిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తమ పరిసరాల్లో నిల్వ నీరు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరం, ఒళ్లు నొప్పుల లాంటి లక్షణాలు ఉంటే వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలన్నారు.

మురిపించిన వాన

- నైరుతి రుతుపవనాల రాకతో డివిజన్ పరిధిలో భారీ వర్షాలు
- రోడ్లన్నీ జలమయం
- వాగులు, వంకలకు జలకళ
- చల్లబడిన వాతావరణం
- ఆనందంలో రైతన్నలు

నందికొట్కూరు: నైరుతి రుతుపవనాలు రాయలసీమ జిల్లాల్లోకి ప్రవేశించాయి. జూన్ మొదటి వారంలోనే నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించి విస్తారమైన వర్షాలు కురువడం వలన వాతావరణం చల్లబడిందని ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. నందికొట్కూరులో 80.2 మి. మీ వర్షపాతం నమోదైంది. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన మారుతీనగర్, బైరెడ్డి నగర్, బీఎస్ఎస్ఆర్ నగర్, ప్రధాన రహదారిపై వర్షపునీరు ప్రవహించింది. మారుతీనగర్‌లో రహదారులన్నీ చెరువులుగా తలపించాయి. మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు సిబ్బంది వర్షపు నీరు నిలువ లేకుండా చర్యలు తీసుకున్నారు. కాలువల వెంట వర్షపు నీరు పారేలా కార్మికులు తరలించారు.

నందికొట్కూరులో 75.2 మి.మీ వర్షం

నందికొట్కూరు రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వేకువజామున భారీ వర్షం కురిసింది. మండలంలోని అల్లూరు, మల్యాల, బొల్లవరం తదితర గ్రామాల్లో 75.2 మి.మీ పైగా వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. దీంతో పలు చోట్ల వాగులు వంకలు పారగా నీటికుంటలు, చెరువుల్లోకి వర్షపు నీరు చేరింది. ఖరీఫ్ పంట సాగుకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పగిడ్యాలలో 38.6 మి.మీ. వర్షపాతం

పగిడ్యాల: నైరుతి రుతుపవనాల రాకతో సోమవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షం 38.6 మి.మీ. నమోదైనట్లు తహసీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ వర్షం ఇప్పటికే ఖరీఫ్ సాగుకు సిద్ధం చేసుకున్న వర్షధార మెట్ట భూములు విత్తనం విత్తుకునేందుకు అనువుగా ఉన్నాయని పేర్కొంటున్నారు. వేసవి తాపంతో అల్లాడిపోతున్నా ప్రజలకు అకాల వర్షం ఉపశమనం కలిగించిందని అభిప్రాయపడ్డారు.

పాములపాడులో 58.2 మిల్లీ మీటర్ల వర్షం

పాములపాడు: మండలంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షం 58.2మిల్లీ మీటర్లుగా నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది తెలిపారు. ఈ వర్షం వల్ల తీవ్ర ఎండలతో ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న జనానికి ఊరట లభించినట్లైంది. పొలాలకు వెళ్లి రైతులు భూములను పరిశీలించుకున్నారు. ఇప్పటికే సేద్యాలు చేసి ఉండటంతో ఇక విత్తనం నాటడమే తరువాయిగా రైతులు పేర్కొంటున్నారు. భూములు విత్తనానికి అనుకూలంగా ఉన్నాయని, మొక్కజొన్న పైరు సాగుకు రైతులు ఇప్పటికే దుకాణాల్లో మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేసుకొని కొందరు సిద్ధంగా ఉన్నారు.

కొత్తపల్లిలో 64.6 మి.మీల వర్షపాతం

కొత్తపల్లి: మండలంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భారీవర్షం కురిసింది. మండలంలోని కపిలేశ్వరం, ఎర్రమఠం, మాదుగుల, ముసలిమడుగు, గుమ్మడాపురం, సింగరాజుపల్లె, శివపురం, గోకవరం, ఎదురుపాడు, కొక్కెరంచ, దుద్యాల, నందికుంట, బావాపురం, గువ్వలకుంట్ల, వీరాపురం గ్రామాలతో పాటు కొత్తపల్లి మండల కేంద్రంలో 64.6 మి.మీల వర్షపాతం నమోదు అయినట్లు ఏఎస్ఓ పాల్ తెలిపారు. రాత్రి 1 గంట సమయం నుంచి సోమవారం ఉదయం 8 గంటల సమయం వరకు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. భారీవర్షం పడడంతో పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. పొలాలు దుక్కులు దున్నుకొని ఎదురుచూస్తున్న రైతులకు ఈ వర్షం ఎంతో ఊరటనిచ్చింది. విత్తనాలు వేసుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

దంచికొట్టిన వాన

జూపాడుబంగ్లా: ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో వాన దంచికొట్టడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన వర్షం 77.4మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. జూన్ మాసం సాధారణ వర్షపాతం జూపాడుబంగ్లా మండలంలో 88.7మిల్లీమీటర్లు కాగా ఒక్కరోజులోనే 77.4మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు తెలిపారు. దీన్ని బట్టి చూస్తే సాధారణం కంటే అధికవర్షాలు కురిసే అవకాశాలున్నాయని ఏఎస్ఓ చెప్పారు. వర్షానికి తర్తూరు సమీపంలోని సుద్దవాగు ఉప్పొంగి ప్రవహించటంతో మండ్లెం చెరువు జలకళను సంతరించుకుంది. పారుమంచాల సమీపంలోని చెక్‌డ్యాంలు వర్షంనీటితో నిండిపోయాయి. ఇసుకవాగు, ఎర్రవాగు, కాకిలేరువాగులు కొద్దిమేర ప్రవహించాయి.



తర్తూరు సమీపంలో బ్రిడ్జి ఎక్కి ప్రవహిస్తున్న సుద్దవాగు

శ్రీశైలంలో భారీ వర్షం



ఆలయ రాజగోపురం వద్ద భారీ వర్షం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో ఆదివారం అర్ధరాత్రి ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి నుంచి నాలుగు గంటల పాటు వర్షం దంచి కొట్టింది. కుండపోత వర్షం కురవడంతో ఆలయ ప్రధాన వీధులన్నీ జలమయం అయ్యాయి. ఒక్కసారిగా భారీగా వర్షం కురవడంతో రాత్రంతా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. శ్రీశైలంలో సుమారు 14 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి ఆలయ క్యూ కాంప్లెక్స్‌లోకి వర్షపు నీరు చేరింది. అలాగే భారీ వర్షం ధాటికి శ్రీశైలం నుంచి హైదరాబాద్ వెళ్లే డ్యాం ఘాటు రోడ్డు వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి.

నియోజకవర్గంలోని నందికొట్కూరు మండలంలో అత్యధికంగా 80.2మిల్లీమీటర్లు నమోదు కాగా పగిడ్యాల మండలంలో అత్యల్పంగా 38.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ తెలిపారు.

భారీ గాలులు, జోరు వాన

మహానంది: మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో సోమవారం తెల్లవారుజామున భారీగాలులు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉన్నట్లుండి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావడంతో అతివేగంతో గాలులు భయాందోళనకు గురిచేశాయి. దీంతో పాటు జోరుగా వర్షం కురవడంతో పలు గ్రామాల్లోని లోతట్టు కాలనీల్లో ఉంటున్న ప్రజలు ఆందోళన చెందారు. గాజులపల్లె సమీపంలోని మహదేవపురం మార్గంలో ఉన్న వాగులో నీరు ఉధృతంగా ప్రవహించింది. బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు నుంచి శింగవరం వెళ్లే మార్గంలో రోడ్డుపై వర్షపునీరు నిలవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. చిన్నచిన్న పంట కాల్వలు నీటితో నిండిపోయాయి. వరుణుడి రాకతో రైతులు తమ పంట పొలాల్లో పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు.

మిడుతూరులో పొంగిపొర్లిన వాగులు

మిడుతూరు: మండలకేంద్రంతో పాటు పీరుసాహెబ్ పేట, చింతలపల్లి, ఖాజీపేట, దేవనూరు, కడుమూరు, చెరుకుచెర్ల, తలముడిపి మాసపేట, నాగలూటి, కలమందలపాడు తదితర గ్రామాల్లో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు పొంగి పొర్లాయి. చింతలపల్లి గ్రామ పరిధిలో విస్తరించిన నారపల్లె చెరువు అలుగు ఎక్కి పారిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పీరుసాహెబ్ పేట గ్రామ శివారులో ఉన్న నాపరాతి గనులు జలకళను సంతరించుకున్నాయి. జూన్ మొదటి వారంలో నైరుతి ఋతుపవనాలు విస్తరించి భారీ వర్షాలు కురియడంతో రైతుల ఆనందానికి అవధులు లేవు. గతేడాది డిసెంబర్ నాటికే ఎండిన బోరుబావులకు.. ఈ వర్షాలతో నీరు పుష్కలంగా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండలకేంద్రంలో 54.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.



పీరుసాహెబ్ పేట గ్రామ పరిధిలో గని కుంట నిండి రోడ్డెక్కి పారుతున్న నీరు



పీరుసాహెబ్ పేట గ్రామ పరిధిలో వర్షపునీటితో నిండిన నాపరాతి గని



చెరువును తలపిస్తున్న మారుతీనగర్‌లోని ఓ వీధి



నందికొట్కూరు ప్రధాన కాలువలో వ్యర్థాలను తొలగిస్తున్న మున్సిపల్ కార్మికులు



అల్లూరు వద్ద పొలాల్లో నిలిచిన వర్షపు నీరు



గుమ్మడాపురం గ్రామ సమీపంలోని పొలాల్లో నిలిచిన వర్షపునీరు



మహానంది మండలం పుట్టుపల్లె వద్ద పంట కాల్వలో వర్షపునీరు



ఈర్నపాడు వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

ప్రజల తీర్పు నేడే

- నేడు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు
- జిల్లాలో తొలి ఫలితం శ్రీశైలం నియోజకవర్గం
- 14 రౌండ్లలో కౌంటింగ్
- మధ్యాహ్నానికి ఫలితం వెలువడే అవకాశం

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది. మంగళవారం ఉదయం ఎన్నికల కౌంటింగ్ ప్రారంభం కానుండగా జిల్లాలో తొలి ఫలితం శ్రీశైలం నియోజవర్గానిదే వెలువడనుంది. దీంతో నియోజకవర్గ ప్రజలతో పాటు కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రజలు శ్రీశైలం ఫలితం కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గంలో 1,96,116 మంది ఓటర్లకు గానూ 1,62,760 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరు ఎవరికి పట్టం కట్టారో నేడు తేలనుంది.

గత ఫలితాలను పరిశీలిస్తే..

2009లో శ్రీశైలం నియోజకవర్గం ఏర్పడగా కాంగ్రెస్ అభ్యర్థిగా ఏరాసు ప్రతాప్‌రెడ్డి, టీడీపీ నుంచి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, పీఆర్‌పీ అభ్యర్థి బుడ్డా శేషారెడ్డి పోటీ పడ్డారు. అప్పట్లో జరిగిన ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఏరాసు ప్రతాపరెడ్డి 4,307 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి పోటీ పడ్డారు. ఇందులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి 4,861 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా శిల్పా చక్రపాణిరెడ్డి, టీడీపీ అభ్యర్థిగా బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పోటీ పడగా.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి రికార్డు స్థాయితో అంత వరకూ ఎవరూ సాధించని విధంగా 38,698 మెజార్టీతో విజయం సాధించారు. ప్రస్తుతం ఎన్నికల్లో ఇరువురూ బరిలో నిలిచారు.

మహిళలు, కొత్త ఓటర్లు వైఎస్సార్‌సీపీకే మద్దతు

శ్రీశైలం నియోజకవర్గంలో మహిళలు, నూతనంగా ఓటుహక్కు కలిగిన యువతీ యువకులు అత్యధికంగా వైఎస్సార్‌సీపీ పార్టీకే మద్దతు తెలిపినట్లు సమాచారం. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమీప ప్రత్యర్థి టీడీపీకి చెందిన బుడ్డా రాజశేఖర్‌రెడ్డిపై భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని వైఎస్సార్‌సీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా శ్రీశైలం నియోజకవర్గంలో రూ.2 కోట్లకు పైగానే బెట్టింగులు జరుగుతున్నట్లు సమాచారం. ఈ బెట్టింగ్ వల్ల గెలుపు, ఓటములు అభిమానులపై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయి.

14 రౌండ్లలో కౌంటింగ్

శ్రీశైలం నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు కోసం నంద్యాలలోని ఆర్‌జీఎం కళాశాలలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీశైలం నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 14 రౌండ్లు ఏర్పాటు చేయగా, నాలుగు రౌండ్లను పోస్టల్ బ్యాలెట్‌లకు కేటాయించారు. మిగిలిన 10 టేబుళ్లు ఏవీఎం మిషన్ల ఓట్ల లెక్కింపునకు కేటాయించారు. ప్రతి పార్టీ తరపున 14 మంది కౌంటింగ్ ఏజెంట్లకు అవకాశమిచ్చారు. కాగా ప్రతి టేబుల్‌కు నలుగురు అధికారులను కేటాయించినట్లు ఆర్వో సుధారాణి తెలిపారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌లను లెక్కించడం జరుగుతుందని, అనంతరం 8.30 గంటలకు ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. రౌండ్ల వారీగా మీడియాకు సమాచారం వెల్లడిస్తామన్నారు. మధ్యాహ్నానికి శ్రీశైలం నియోజకవర్గ తొలి ఫలితం వెలువడుతుంది. సాయంత్రం 6 గంటలకు గెలుపొందిన అభ్యర్థికి ఆర్వో డిక్లరేషన్ అందజేస్తారు.



ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

మద్యం అమ్మితే కఠిన చర్యలు

ఆత్మకూరు: మండలంలో ఎవరైనా మద్యం అమ్మితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు సీఐ కె.లక్ష్మీనారాయణ హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం రోజున ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మద్యం విక్రయాలను నిషేధించినట్లు తెలిపారు. ఫలితాలు వెలువడ్డాక గెలిచిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలు, సమావేశాలు, టపాసులు పేల్చడం లాంటివి చేయరాదన్నారు. 144 సెక్షన్, 30 పోలీస్‌యాక్ట్ అమలులో ఉన్నందున నలుగురు మించి ఎక్కడా గుంపులుగా గుమిగూడరాదని చెప్పారు.

నేడు నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం

మహానంది: మహానందిలో స్వయంభువుగా వెలిసిన శ్రీ మహానందీశ్వరుడి గర్భాలయం ఎదురుగా ఉన్న నందీశ్వరస్వామికి మంగళవారం ప్రదోషకాలంలో అభిషేకం, అర్చన పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ వైశాఖమాసం, బహుళ త్రయోదశిని పురస్కరించుకుని ప్రదోషకాలంలో సాయంత్రం ప్రత్యేక అభిషేక, అర్చనలు ఉంటాయన్నారు. భక్తులు అభిషేక, అర్చన పూజల్లో పాల్గొనాలని కోరారు. నందీశ్వరుడికి ప్రదోషకాలంలో అభిషేకం చేయడం ద్వారా తెలిసీ, తెలియక చేసిన దోషాలు తొలగిపోతాయని వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు.

శివ పార్వతుల కల్యాణంపై హరికథ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద కె.ప్రమీల భాగవతారిణి, రాయచోటి వారిచే శివ పార్వతుల కల్యాణం హరికథ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమములో హార్మోనియం సహకారాన్ని ఎం. మధుసూదన్, తబలా సహకారాన్ని ఎన్.బాబురావు అందించారు.



హరికథ వినిపిస్తున్న కళాకారులు

ఓంకారేశ్వరుడికి 108 కొబ్బరికాయలు

మహానంది: అన్నివర్గాల వారి సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మరోసారి గెలవాలని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవ్వాలని మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మండల ఓంకారం పుణ్యక్షేత్రంలో సోమవారం మండల నాయకులతో కలిసి శ్రీ గంగ, ఉమా సమేత ఓంకారసిద్ధేశ్వరస్వామి వార్లను దర్శించుకుని 108 కొబ్బరికాయలు సమర్పించి పూజలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ, నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి భారీ మెజారిటీతో గెలవాలని పూజలు చేశామన్నారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం అధ్యక్షుడు దీపుకాంత్‌రెడ్డి, నాయకులు ముంతల శేఖర్, సీమ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓంకారంలో పూజలు నిర్వహించిన మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, మండల నాయకులు

మహిళపై దాడి

పగిడ్యాల: తమకు తెలియకుండా ఇల్లు ఎలా కొంటారని నానా దుర్భాషలాడుతూ విచక్షణా రహితంగా తనపై దాడి చేశారని బాధితురాలు బీపాషా సోమవారం ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని పడమర ప్రాతకోట ముస్లిం కాలనీకి చెందిన మహబూబ్‌బీ కూరగాయల వ్యాపారం చేస్తూ కొన్నేళ్లుగా అద్దె ఇంటిలో నివాసం ఉంటోంది. ఆ ఇంటి యజమాని మహేందర్ ఇల్లు అమ్మకానికి పెట్టగా రూ.4.70 లక్షలకు కొనుగోలు చేసి, పది రోజుల క్రితం అడ్వాన్స్ ఇచ్చింది. ఈ విషయం తెలుసుకున్న ఉసేన్‌బీ, ఆశాబీ, ఉసేన్‌బీ తమకు తెలియకుండా మా ఇంటి పక్కన ఉండే ఇల్లు ఎలా కొంటావని మహబూబ్‌బీ వ్యక్తిగత జీవితంపై నిందలు మోపసాగారు. మా వదినపై నిందలు మోపవద్దని, ఇల్లు అమ్మిన యజమానితో మాట్లాడుకోవాలని మహబూబ్‌బీ మరదలు బీపాషా.. ఉసేన్‌బీకి చెప్పింది. దీంతో కోపోద్రేక్తురాలైన ఉసేన్‌బీ తన ఇద్దరి కుమార్తెలను ప్రేరేపించి కుళాయి పైప్‌లతో విచక్షణరహితంగా మూకుమ్మడిగా దాడి చేయడంతో బీపాషా తలకు, శరీరంపై గాయాలు అయ్యా యి. ఈ మేరకు బాధితురాలు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయమై ముచ్చుమర్రి పోలీసులదృష్టికి తీసుకెళ్లగా కేసు విచారిస్తున్నామని, ఇరువర్గీయులకు దెబ్బలు తగిలాయని వెల్లడించారు.

పింఛన్‌దారులతో బ్యాంకులు కిటకిట

పాములపాడు: మండలంలోని అన్ని బ్యాంకులు పింఛన్ దారులతో కిటకిట లాడాయి. సోమవారం ఆయా గ్రామాల పరిధిలోని బ్యాంకులకు, బ్యాంకు సేవా కేంద్రాలకు వృద్ధులు, వితంతువులు, వికలాంగులు డబ్బుల కోసం క్యూ కట్టారు. బ్యాంకుల వద్ద ఎక్కువ సమయం వేచి ఉండాల్సి రావడంతో వృద్ధుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఎన్నికల కోడ్‌కు ముందు గ్రామ వలంటీర్లు ఇంటింటికి వచ్చి ఉదయమే పింపిణీ చేయడంతో పింఛన్ దారులకు ఈ కష్టాలు లేవు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన గ్రామ వలంటీర్ల విధానంతో పింఛన్ల కోసం పడిగాపులు తప్పాయి. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని పింఛన్‌దారులు కోరుకుంటున్నారు. ఆయన వస్తే తమకు బాధలు తప్పుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 5,894 మంది పింఛన్ దారులుండగా జూన్ నెలకు సంబంధించి రూ.1,71,73,000 మంజూరయ్యాయి. ఈ నగదును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగింది. బ్యాంకు ఖాతాలు లేని వారు, పూర్తిగా నడవ లేని వారికి అధికారులు ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందిస్తున్నారు.



పాములపాడు బ్యాంకులో నగదు కోసం క్యూలో నిల్చున్న పింఛన్‌దారులు

ఈ బాధలు పడలేమయ్యా



నేను పక్షవాతంతో బాధ పడుతున్నాను. ఇంటి వద్ద నుంచి బ్యాంకు వద్దకు నడిచి రావాలి. ఇక్కడ చాలా సేపు వేచి ఉండాలి. ఈ బాధలు పడలేమయ్యా. అప్పుడే బాగుండేది. మళ్లీ ఇండ్ల వద్దకు పింఛన్ ఇచ్చే ప్రభుత్వాన్నే మేము కోరుకుంటున్నాము. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి ఆలోచనతోనే వృద్ధుకు కష్టాలుండవు.

–మదార్‌సాహెబ్,
వృద్ధాప్య పింఛన్ దారుడు, పాములపాడు

పనితీరును మెరుగుపరుచుకోవాలి

మిడుతూరు: విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా పనితీరును మెరుగుపరుచుకోవాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని ఎంపీడీఓ గంగావతి హెచ్చరించారు. సోమవారం మిడుతూరు–1, జలకనూరు, చింతలపల్లి గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ తనిఖీ చేశారు. ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. సచివాలయానికి హాజరై విధుల నిమిత్తం వెళ్లిన సిబ్బంది వివరాలపై ఆరా తీశారు. చింతలపల్లి సచివాలయ సిబ్బంది హాజరు పట్టికలో 11 గంటలకు నమోదు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. 10.30 గంటలకు విధులకు హాజరై నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ సురేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



చింతలపల్లి సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గంగావతి

8 నుంచి బస్‌పాస్‌ల జారీ

ఆత్మకూరు: ఈనెల 8వ తేదీ నుంచి విద్యార్థుల బస్‌పాస్‌లు జారీ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు డిపో మేనేజర్ మహేంద్రుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త సాఫ్ట్‌వేర్ ప్రవేశపెడుతుండడం వల్ల జూన్ 6, 7వ తేదీల్లో బస్‌పాస్‌ల జారీ చేయలేకపోతున్నామని, ఈ విషయాన్ని విద్యార్థులు, అన్నిరకాల ప్రయాణికులు గమనించాలన్నారు.